

మాజీ కార్పొరేటర్ గౌరీష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే వివేకానంద్.



కొంపల్లిలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్



పద్మానగర్ ఫేజ్-1లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్..

బీఆర్ఎస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు

ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ పార్టీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని... మూడోసారి కుత్బుల్లాపూర్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయడం ఖాయమని ఎమ్మెల్యే వివేకానంద్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజులు అన్నారు. మంగళవారం సుభాష్‌నగర్ డివిజన్ సూరారం కాలనీ లాస్ట్ బస్టాప్‌లో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కోలా శ్రీకాంత్ ఆధ్వర్యంలో జనసేనకు చెందిన గణేష్, ప్రశాంత్‌రెడ్డిలు తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే వివేకానంద్, శంభీపూర్ రాజు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్‌లు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారని, నవంబరు 30 జరిగే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో తొమ్మిదేళ్లుగా తాము చేసిన అభివృద్ధి కార్యక్రమాలే తనను గెలిపిస్తాయని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షుడు పోలె శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ బొప్ప రంగారావు, నాయకులు కోల రవీందర్ ముదిరాజ్, ఎంఎస్ వాసు, వారాల వినోద్, గుబ్బల లక్ష్మీనారాయణ, నరసింహారెడ్డి, రాఘవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

◆ మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే వివేకానంద్ వారిని సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఒక్కొక్క నాయకుడి చేరికతో బీఆర్ఎస్ పార్టీ మరింత పటిష్టంగా తయారయ్యిందన్నారు. సంక్షేమమే పరమావధిగా ముందుకు సాగుతున్న తనను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు.

◆ కొంపల్లి మున్సిపల్ పరిధి బ్యాంకు కాలనీ, గజానన్ అపార్ట్‌మెంట్స్‌లో ఎమ్మెల్యే ప్రజా ఆశీర్వాద సభను నిర్వహించగా ఆ ప్రాంతామంతా గులాబీ మయమైంది 8వ వార్డుకు చెందిన రవీందర్ రెడ్డి, కిట్టుల ఆధ్వర్యంలో, 6వ వార్డు కౌన్సిలర్ పూజారి వసంత లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో శివాలయం కమాన్ నుంచి గజానన్ అపార్ట్‌మెంట్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. అనంతరం 2వ వార్డులో కౌన్సిలర్ జండా మంజుల కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రజా ఆశీర్వాద సభలు నిర్వహించారు.



సూరారం లాస్ట్ బస్టాప్‌లో జరిగిన సభలో బీఆర్ఎస్‌లో చేరిన జనసేన నాయకులకు పార్టీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్

◆ చింతల్ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు మక్సుద్ అలీ ఆధ్వర్యంలో రోడామేస్త్రి నగర్-ఏ చెందిన యువకులు భారీ సంఖ్యలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

◆ పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో భగత్ సింగ్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్ రావు, పరశురామ్‌లు తమ అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు.

◆ హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ (హెచ్‌సీజీ) ఆధ్వర్యంలో ఈ సంవత్సరం కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు నిర్వహించనున్న సైకిల్ పోటీల పోస్టర్ ను ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆవిష్కరించారు. సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద గారు మాట్లాడుతూ సైక్లింగ్ ద్వారా శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అనంతరం హైదరాబాద్ సైకిల్ గ్రూప్ సభ్యులు మాట్లాడుతూ.. 2017 సంవత్సరం నుంచి ఎమ్మెల్యే వివేకానంద సహాయ సహకారాలతో వరుసగా గత రెండేళ్లుగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైక్లింగ్ యాత్ర 13 మందితో దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. ఈనెల 15 నుంచి ప్రారంభమయ్యే 3వసారి యాత్రను విజయవంతంగా పూర్తిచేస్తామన్నారు.

◆ గాజుల రామారం డివిజన్‌కు చెందినకుత్బుల్లాపూర్ సౌండ్స్ అండ్ లైటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గూదే రాజశేఖర్‌తో పాటు పలువురు ఎమ్మెల్యే కేపీ వివేకానంద సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

◆ కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేజ్-1లో మాజీ కార్పొరేటర్ కె.ఎం.గౌరీ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, డివిజన్ యూత్ ప్రెసిడెంట్ కూన గిరిధర్‌గౌడ్, రమణారెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాస్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

200మంది నామినేషన్లు వేస్తాం

సూపర్ మ్యాక్స్ కార్మికుల స్పష్టీకరణ

కుత్బుల్లాపూర్: తమ సమస్యలు పట్టించుకోకుండా కాలయాపన చేసిన ప్రజా ప్రతినిధులపై నిరసనగా జీడిమెట్ల పారిశ్రామికవాడలోని సూపర్ మ్యాక్స్ కార్మికులు నామినేషన్ వేయడానికి సిద్ధమవుతున్నారు. జీడిమెట్ల బస్ డిపో వద్ద ఉన్న కంపెనీలో విధులు నిర్వర్తిస్తున్న వెయ్యి మంది కార్మికులు తమకు 18 నెలల నుంచి జీతభత్యాలు రావడం లేదని గత కొన్ని నెలలుగా కంపెనీ వద్ద నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. ఇదే అంశంపై తమ సమస్యను పరిష్కరించాల్సిందిగా ప్రభుత్వంలో ఉన్న పెద్ద స్థాయి అధికారులను కలవడమే కాకుండా మంత్రి మల్లారెడ్డిని, స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానందను, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులను కలిసి వినతి పత్రాలు గతంలో అందజేశారు. పలుమార్లు ప్రజాప్రతినిధులు సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చినప్పటికీ అది ఇప్పటివరకు నెరవేరలేదు. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ కుత్బుల్లాపూర్ మీదుగా నర్సాపూర్ వెళ్లే గ్రామంలో ఆయనను కేపీ వివేకానంద సమక్షంలో కలిసే ప్రయత్నం చేసిన అది సాధ్యం కాలేదు. నాటి నుంచి నేటి వరకు వారి సమస్య అలాగే ఉండిపోయింది.

నామినేషన్ల ద్వారా నిరసన గళం..



నామినేషన్ పత్రాలతో సూపర్ మ్యాక్స్ కంపెనీ కార్మికులు

సూపర్ మాక్స్ కంపెనీ లో ఉన్న మూడు యూనియన్ల లో ఉన్న 1000 మంది కార్మికులు ఎన్నికల వేల ప్రభుత్వానికి షాక్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఎన్ని మార్లు విజ్ఞప్తులు చేసిన తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ఎన్నికల బరిలో నిలిచి తమ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం పెద్ద ఎత్తున కార్మికులు కుత్బుల్లాపూర్ రిటర్నింగ్ కార్యాలయం తరలివచ్చి నామినేషన్ పత్రాలు తీసుకున్నారు. ఇప్పటి వరకు 36 మంది నామినేషన్ పత్రాలు తీసుకున్నామని తెలిపారు. దాదాపుగా 200 నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నామని కార్మికులు స్పష్టం చేశారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ప్రాంతానికి చెందిన కార్మికులు అత్యధిక శాతం పని చేస్తూ వస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు ఏ ఒక్క నాయకుడు తమ సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ రావడం మూలంగానే తాము నామినేషన్లు వేసేందుకు వస్తామని తెలిపారు.

డీప్ లెర్నింగ్ ఇన్ సైబర్ సెక్యూరిటీపై జాతీయ సదస్సు



సుభాష్‌నగర్: మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్-టెక్నాలజీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం సెర్ప్ ఇండియా సహకారంతో అప్లికేషన్స్ ఆఫ్ డీప్ లెర్నింగ్ ఇన్ సైబర్ సెక్యూరిటీపై మూడు రోజుల జాతీయ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డీప్ లెర్నింగ్, మిషన్ లెర్నింగ్ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఐటీ ప్రముఖులు పాల్గొని సదస్సు ముఖ్య ఉద్దేశమైన సైబర్ సెక్యూరిటీ, దాని ప్రధాన ఆవశ్యకతను వివరించారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ అన్నారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ 57వ తరగతి గదిలో ఈ నెల 11న జరిగే మహాసభ విజయవంతం కోసం సన్నాహక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ.. ఏ పార్టీ గెలిచినా ఓడినా మాదిగలకు ఒరిగేది ఏమీ లేదని రిజర్వేషన్ల వర్గీకరణతోనే అభివృద్ధి అవుతామన్నారు.

కరపత్రాల పంపిణీ..

పద్మారావునగర్: సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో ఈ నెల 11న జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు.

సౌకర్యార్థమని నిర్మించారు..

● నిరుపయోగంగా మార్చారు!

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థి సంఘాల కోసం నిర్మించిన విద్యార్థి చర్చ వేదిక భవనం (స్టూడెంట్ డిస్కోర్స్ సెంటర్) నిరుపయోగంగా మారుతోంది. ఆర్ట్స్ కాలేజీ ఎదుట విద్యార్థి సంఘాల సభలు, సమావేశాలు, ఆందోళనలు, ఇతర కార్యక్రమాలపై నిషేధం విధించిన వీసీ ప్రొ.రవీందర్ రెండేళ్ల క్రితం రూ.18 లక్షల వ్యయంతో ప్రత్యేక భవనాన్ని నిర్మించారు. కానీ ఈ భవనంతో పట్టుమని పది కార్యక్రమాలు కూడా జరగలేదు. చేసే కార్యక్రమాలు ఆర్ట్స్ కాలేజీ ఎదుట అయితే మీడియా ద్వారా గుర్తింపు వస్తుందని విద్యార్థులు జన్మదిన వేడుకలతో మొదలు ప్రతి కార్యక్రమాన్ని కళాశాల వేదికగా నిర్వహిస్తున్నారు. దీంతో డిస్కోర్స్ సెంటర్ భవనం వృథాగా దర్శనమిస్తోంది. ఈ భవనాన్ని ఇతర కార్యక్రమాలకు ఉపయోగించాలని విద్యార్థి నేతలు పేర్కొన్నారు.



అపురూపాకాలనీలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి బీజేపీ కండువాలు కప్పుతున్న కూన శ్రీశైలంగౌడ్



అల్లూరి సీతారామరాజునగర్‌లో శ్రీశైలంగౌడ్ సమక్షంలో బీజేపీలో చేరిన వెంకన్నగౌడ్ తదితరులు

12 నుంచి దీపోత్సవం

సుభాష్‌నగర్: కార్తీక మాసం పురస్కరించుకుని సూరారం కాలనీ రామ్‌లీలా మైదానంలో నెల రోజుల పాటు ప్రత్యేక భక్తి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రామ్ లీలా మైదాన్ ఉత్సవ కమిటీ పేర్కొంది. ఈనెల 12 నుంచి డిసెంబరు 12వ తేదీ వరకు ప్రతి రోజు రాత్రి 7 నుంచి 8 వరకు దీపోత్సవం కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే ప్రతి సోమవారం 5 వారాల పాటు విశేషంగా దీపోత్సవం జరుగుతుందన్నారు. డిసెంబర్ 27 సోమవారం రాత్రి 8 గంటల నుంచి కార్తీక భోజనాలు ఉంటాయని భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

బీసీ ఆత్మగౌరవ సభకు తరలిన కమల దళం



సభకు తరలివెళ్తున్న బీజేపీ నేతలు

దుండిగల్: నగరంలోని ఎల్బీ స్టేడియంలో జరగనున్న బీజేపీ బీసీ ఆత్మగౌరవ సభకు కుత్బుల్లాపూర్ నుంచి పార్టీ నేతలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి, నేతలు మల్లేశ్ యాదవ్, పీసరి కృష్ణారెడ్డి, డి.విష్ణువర్ధన్‌చారి, రాంచంద్రారెడ్డి, గోనె మల్లారెడ్డి, వెంకటేశ్‌నాయక్ తదితరులు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు. దేశ ప్రగతి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు.

రెండు నామినేషన్లు దాఖలు

కుత్బుల్లాపూర్: ఎన్నికల నిమినేషన్ల ప్రక్రియలో భాగంగా మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. గాజులరామారం ప్రాంతానికి చెందిన ఎంసీపీఐ(యు) నుంచి రవీందర్, గాజులరామారానికి చెందిన శివకుమార్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్లు వేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పులి సైదులు తెలిపారు.

యువతి ఆత్మహత్య



మృతురాలు దివ్య

జగద్గిరిగుట్ట: అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట పాపిరెడ్డినగర్‌కు చెందిన స్వామిగౌడ్ కుమార్తె దివ్య(21) ప్రైవేట్ ఉద్యోగి. కాగా గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న ఫలితం లేకపోయింది. దీంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన దివ్య మంగళవారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు ఆమెను కిందకు దింపగా అప్పటికే మృతి చెందింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

యథేచ్ఛగా స్థలాల కబ్జా

నిజాంపేట్: జీవో 59 పేరిట అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రభుత్వ స్థలాలను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆరోపించారు. నిజాంపేట్ కార్పొరేషన్ సర్వే నెంబరు 301లోని కృష్ణజే హిల్స్‌లో వికాస్ స్కూల్‌ను అనుకుని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల సహకారంతో ఓ వ్యక్తి 700 గజాల స్థలాన్ని దర్జాగా ఆక్రమించుకుని కాంపౌండ్ వాల్ నిర్మించాడు. ఎవరైనా ప్రశ్నిస్తే జీవో 59 కింద రెగ్యులరైజ్ చేయించుకున్నామని చెబుతున్నారని అన్నారు. స్వాధీనం చేసుకుని ప్రజావసరాలకు వినియోగించాలని కోరారు.

యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల కబ్జా

నిజాంపేట్: జీవో 59 పేరిట అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రభుత్వ స్థలాలను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆరోపించారు. నిజాంపేట్ కార్పొరేషన్ సర్వే నెంబరు 301లోని కృష్ణజే హిల్స్‌లో వికాస్ స్కూల్‌ను అనుకుని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల సహకారంతో ఓ వ్యక్తి 700 గజాల స్థలాన్ని దర్జాగా ఆక్రమించుకుని కాంపౌండ్ వాల్ నిర్మించాడు. ఎవరైనా ప్రశ్నిస్తే జీవో 59 కింద రెగ్యులరైజ్ చేయించుకున్నామని చెబుతున్నారని, ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని ప్రజావసరాలకు వినియోగించాలని కోరారు.

నాగుపాము కలకలం



పామును పట్టుకున్న ఆకాష్

సుభాష్‌నగర్: అరణ్యంలో ఉండాల్సిన సర్పం జనారణ్యంలోకి రావడంతో స్థానికులు బెంబేలెత్తారు. గాజులరామారం డివిజన్ కట్టమైసమ్మ బస్తీలో మంగళవారం ఓ ఇంట్లోకి నాగుపాము ప్రవేశించింది. భయభ్రాంతులకు గురైన కుటుంబ సభ్యులు ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీశారు. పాములు పట్టడంలో దిట్ట అయిన స్థానికంగా ఉన్న ఆకాష్ సమాచారం ఇవ్వడంతో పాము చాకచక్యంగా పట్టి పక్కనే ఉన్న అడవిలోకి వదిలాడు. రాత్రివేళల్లో విద్యుత్ దీపాలు లేకపోవడంతోనే ఇంట్లోకి ప్రవేశిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోని విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఇఫ్లూ విద్యార్థుల హంగర్ స్ట్రైక్

ఉస్మానియా యూనివర్సిటీ: ఇఫ్లూ విద్యార్థులు హంగర్ స్ట్రైక్ చేపట్టారు. ఈ నెల 6వ తేదీ రాత్రి నుంచి యూనివర్సిటీ ప్రవేశ ద్వారం వద్ద దీక్షలు చేపట్టారు. గత నెల 18న లైంగిక వేధింపులకు గురైన పీజీ విద్యార్థినికి న్యాయం జరిగే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని విద్యార్థులు హెచ్చరిస్తున్నారు.

కుత్బుల్లాపూర్ ప్రజలు | మార్పును కోరుకుంటున్నారు

బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: అవినీతి పాలన కొనసాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి బొంద పెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని... రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడనుందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మంగళవారం సుభాషనగర్ డివిజన్ అపురూప కాలనీలో జరిగిన కార్యక్రమంలో యువ నాయకుడు దిలీప్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో యువకులు బీజేపీలో చేరగా వారికి శ్రీశైలం గౌడ్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాధనం దోచుకోవడం, దాచుకోవడమే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. తొమ్మిదన్నర ఏళ్లుగా రాష్ట్రాన్ని అప్పుల పాటు చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో నిరుద్యోగం, అవినీతి పెరిగిపోయిందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే యువతకు ఉద్యోగవకాశాలు కల్పిస్తామన్నారు. కుత్బుల్లాపూర్ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని అన్నారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలన్నారు.

బీజేపీలోకి రాజీవ్‌గృహకల్పకు చెందిన మనపాటి శ్రీనివాస్...

◆ సుభాష్‌నగర్ డివిజన్ సూరారం రాజీవ్‌గృహకల్పకు చెందిన మనపాటి శ్రీనివాస్ తన అనుచరులతో కలిసి శ్రీశైలంగౌడ్, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డిల సమక్షంలో బీజేపీలో చేరారు. యోగి, సంజయ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, కిషన్ రెడ్డి, బన్నీ లు పార్టీలో చేరగా డివిజన్ అధ్యక్షుడు కంది శ్రీరాములు, నాయకులు లక్ష్మీపతి రాజు, భీమరాజు, విజేందర్ రెడ్డి, కుమ్మరి శంకర్, విగ్నేష్, రాము, విజయ్, అఖిల్, క్రాంతి, గంధం కుమారస్వామి, సంజు కుమార్, టైగర్ రాము, గోపి, చక్రి, సంతోష్, పవన్, దేవి, శిరీష, అరుణ తదితరులు పాల్గొన్నారు.




ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం తెలుపుతున్న కూన శ్రీశైలంగౌడ్

◆ కూన శ్రీశైలంగౌడ్‌తో జనసేన నేత సతీష్ భేటీ

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు నందగిరి సతీష్‌ను జగద్గిరిగుట్టలోని ఆయన నివాసంలో బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలం గౌడ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. బీజేపీ, జనసేన పొత్తు నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో తన విజయానికి సమష్టిగా పని చేయాలని కోరారు.

◆ కుత్బుల్లాపూర్ పద్మశాలి సంఘం నాయకులు కూన శ్రీశైలంగౌడ్‌ను షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి మద్దతు తెలిపారు. పద్మశాలి కులస్తులు ఏకగ్రీవంగా శ్రీశైలం గౌడ్‌కు ఓటేసి గెలిపించుకుంటామని పరకటించారు.

◆ సుభాషనగర్ డివిజన్ అల్లూరి సీతారామరాజు నగర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకన్న గౌడ్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో ఆ పార్టీ నాయకుల బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అంజయ్య, శివకుమార్, పద్మ, బీహార్ లక్ష్మి, కరుణశ్రీ, విజయలక్ష్మి లు పార్టీలో చేరగా శ్రీశైలంగౌడ్ వారిని సాదరంగా ఆహ్వానించారు.



ప్రసూననగర్‌కు చెందిన యువకులకు బీజేపీ కండువాలు కప్పుతున్న కూన శ్రీశైలంగౌడ్

◆ కుత్బుల్లాపూర్ ప్రసూనానగర్‌కు చెందిన యువకులు స్థానిక నాయకులు విజయ గుప్తా, వీరేంద్ర గుప్తా, కృష్ణ గుప్తా ల ఆధ్వర్యంలో బీజేపీ చేరగా శ్రీశైలంగౌడ్ వారికి పార్టీ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీలో యువతకు తగిన గుర్తింపు ఉంటుందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేయాలన్నారు.



జగద్గిరిగుట్టలో జనసేన నాయకుడు నందగిరి సతీష్‌ను కలిసిన కూన



ఎల్బీస్టేడియంలో జరిగిన బీసీ ఆత్మగౌరవ సభలో ఒకే వేదికపై జనసేన అధినేత పవన్ కల్యాణ్, బండి సంజయ్‌తో కూన శ్రీశైలంగౌడ్

ఈవీఎంలు సిద్ధం చేయాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: నామినేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత పోటీలో ఉండే అభ్యర్థుల సంఖ్య ఆధారంగా అవసరమైన మేరకు ఈవీఎంలను సర్దుబాటు చేయాల్సి ఉంటుందని మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. ఈ నెల 18న రెండో దశ ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఎన్నికల పరిశీలకులు, డీజీపీ అంజనీ కుమార్, రాష్ట్రస్థాయి, ఉన్నతస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, డీసీపీ శబరీష్ కలిసి ఎన్నికల నోడల్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ మాట్లాడుతూ పెండింగ్ ఓటరు నమోదు దరఖాస్తులను మూడు రోజుల వ్యవధిలో పరిష్కరించాలని అన్నారు.

◆ ఎన్నికల తనిఖీలలో నగదు, బంగారం, ఇతర ఆభరణాలు జప్తు చేసే సమయంలో ఈఎస్ఎంఎస్ యాప్‌లో వెంటనే నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారం సంబంధించి సమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు పార్టీలు, అభ్యర్థుల నుంచి వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, అనుమతులు మంజూరు చేయాలన్నారు.

◆ జిల్లాలో ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని నామినేషన్లు స్వీకరణ ప్రక్రియ ముగిసిన వెంటనే ప్రారంభించాలన్నారు. గతంలో తక్కువ పోలింగ్ నమోదైన కేంద్రాలపై దృష్టి సారించి పోలింగ్ శాతం పెరిగే విధంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

◆ సువిధ యాప్ ద్వారా ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ఇతర కార్యకలాపాల కోసం వచ్చే దరఖాస్తులను వెంటనే పరిశీలించి.. నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోపు అనుమతులు మంజూరు చేయాలన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వెబ్ క్యాస్టింగ్ కోసం ఎంపిక చేసిన వారికి శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు.

◆ పోస్టల్ బ్యాలెట్ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీనియర్ సిటిజన్స్, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి ఓటింగ్ ప్రక్రియ నిర్వహించే సమయంలో నిబంధనలను తప్పకుండా పాటించాలని సూచించాలని అన్నారు.